# మిలాద్ ఉన్ నబి సందర్భంగా ముస్లిం సోదర సోదరీమణులకు శుభాకాంక్షలు

కాకినాడ జిల్లా ఎస్పీ జి. బిందుమాధవ్



**కాకినాడ బ్యూరో, 25 ఆగష్టు 2026, భారత్ ప్రతినిధి న్యూస్** : మిలాద్ ఉన్ నబి పర్వదినాన్ని పురస్కరించుకుని కాకినాడ జిల్లా ఎస్పీ జి. బిందుమాధవ్, ముస్లిం సోదర సోదరీమణులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ పవిత్ర పర్వదినాన్ని ప్రతిఒక్కరూ సంతోషంగా, భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఆకాంక్షించారు. పండుగ సందర్భంగా జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా పటిష్టమైన బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ మరియు ముందస్తు భద్రతా చర్యలు చేపట్టాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా మసీదులు, దర్గాలు, ప్రార్థనా స్థలాల వద్ద భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రార్థనలు, ఊరేగింపులు,ఇతర పండుగ కార్యక్రమాలు శాంతియుతంగా, క్రమశిక్షణతో, పరస్పర సహకారంతో నిర్వహించుకోవాలని, ప్రజలు పోలీసులకు సహకరించాలని జిల్లా ఎస్పీ కోరారు.

## సామాజిక బాధ్యతగా 50 కుర్చీలు 20 సీలింగ్ ఫ్యాన్లు విరాళం



**కొత్తవలస, 25 ఆగష్టు 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** విజయనగరం జిల్లా కొత్తవలస మండలం వియ్యంపేటలోని డా. బి.ఆర్.అంబేద్కర్ గురుకులం పాఠశాలకు విద్యార్థుల సౌకర్యాలను మెరుగుపరచే ఉద్దేశంతో సామాజిక బాధ్యత (CSR)గా Sarda Metals and Alloys Ltd. సంస్థ మంగళవారం 50 కుర్చీలు మరియు 20 సీలింగ్ ఫ్యాన్లు విరాళంగా అందించింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు N.V.S. లక్ష్మి సంస్థ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సన్యాసి రావు, GM-HR G. శంకర రావు, Dy. Manager-HR మరియు రాజేష్, P4 Officer పాల్గొన్నారు. ఈ సందర్భంగా సన్యాసి రావు మాట్లాడుతూ భవిష్యత్తులో అభివృద్ధికి విద్యే పునాది అని అన్నారు. విద్యార్థులు చిన్న వయస్సు నుంచే వివిధ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని, తద్వారా భవిష్యత్తులో లభించే మంచి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## భక్తిశ్రద్ధలతో విశ్వ గురువు మహా ప్రవక్త జన్మదిన వేడుకలు




**గుంటూరు, 25 ఆగష్టు 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** విశ్వ గురువు మహా ప్రవక్త హజరత్ మహమ్మద్ ముస్తఫా రసూలుల్లా వారి జన్మదిన వేడుకలు కుదుబ్ షాహీ హజరత్ సయ్యద్ షా, మొహిద్దిన్ బాదుషా మౌలియా దర్గాలో బుధవారం జరగనున్నాయి. ఈ సందర్భంగా దర్గా పీఠాధిపతి అల్ రసూల్ హజరత్ పీర్ సయ్యద్ షా సులేమాన్ కాబోలి అల్ కిలాలి సాహెబ్ మీడియా తో మాట్లాడారు. బుధవారం ఉదయం 9 గంటల నుండి మహమ్మద్ ప్రవక్త వారి నామస్మరణ స్మరిస్తూ హజరత్ మొహిద్దిన్ షా మోలియా దర్గా నుండి గొప్ప ఊరేగింపు కార్యక్రమం జరుగుతుందని అన్నారు. ప్రజలకు శాంతి సందేశం ఇస్తూ కులమతాలకతీతంగా ప్రజలందరికీ ప్రసాదం పంచి పెడతామని అన్నారు. దేశ ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలని బుధవారం సాయంత్రం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తామని అందులో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో స్థానిక ముస్లిం పెద్దలు ప్రజలు పాల్గొన్నారు.

# అమలాపురంలో డీఎస్పీ కార్యాలయం ప్రారంభం



**అంబేద్కర్ కోనసీమ జిల్లా బ్యూరో, 25 ఆగష్టు 2026, భారత్ ప్రతినిధి న్యూస్** : అమలాపురంలో నూతనంగా ఏర్పాటు చేసిన డీఎస్పీ కార్యాలయాన్ని మంగళవారం ఏలూరు రేంజ్ డీఐజీ జి.వి.జి. అశోక్‌కుమార్, ఐపీఎస్ ప్రారంభించారు. ముందుగా డీఐజీకి వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిరాజు, ఎమ్మెల్సీలు కుడుపూడి సూర్యనారాయణ, బొమ్మి ఇజ్రాయెల్, పేరాబత్తుల రాజశేఖరం, అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, అల్లాడ శరత్‌బాబు, పెచ్చెట్టి చంద్రమౌళి, ఆర్డీఎస్ ప్రసాద్, కంచిపల్లి అబ్బులు, బోణం సత్యవరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా జిల్లా ఎస్పీ రాహుల్ మీనా, ఐపీఎస్, అదనపు ఎస్పీ మహేంద్ర మత్తే, అమలాపురం ఎస్‌డీపీఓ టి.ఎస్.ఆర్.కె. ప్రసాద్, అమలాపురం టౌన్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ పి. వీరబాబు, ఎస్సైలు, పంచాయతీరాజ్ అధికారులు, ఇతర పోలీసు అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రముఖులు హాజరయ్యారు. నూతన డీఎస్పీ కార్యాలయం అందుబాటులోకి రావడంతో అమలాపురం సబ్ డివిజన్ పరిధిలో పోలీసు పరిపాలన, శాంతి భద్రతల పర్యవేక్షణ మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు అవకాశం ఏర్పడిందని అధికారులు తెలిపారు.

# సాదిక్ ఖాన్ తో సంబంధం లేదు

ఉద్దేశపూర్వకంగా తనపై దుష్ప్రచారం మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి



**కాకినాడ బ్యూరో, 25 ఆగష్టు 2026, భారత్ ప్రతినిధి న్యూస్** : పిఠాపురం అసిస్టెంట్ ఇంజనీర్ నూకరాజు కుటుంబం ఆత్మహత్య కేసులో ప్రధాన నిందితునిగా ఉన్న సాదిక్ ఖాన్ తో తనకు ఎటువంటి సంబంధం లేదని వైయస్ఆర్సీపీ కాకినాడ సిటీ కోఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి స్పష్టం చేశారు. తనపై మీడియాలో వస్తున్న ఆరోపణలు తీవ్రంగా ఖండించారు. రాజకీయంగా తనకు నష్టం కలిగించాలనే ఉద్దేశంతోనే కొన్ని మీడియా సంస్థలు, సోషల్ మీడియాలో ఉద్దేశపూర్వకంగా దుష్ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. మంగళవారం ఆయన విజయవాడలో విలేకరులతో మాట్లాడుతూ 2023 ఫిబ్రవరి 14వ తేదీన సాధిక్ ఖాన్ రైఫిల్ ఇన్స్టిట్యూట్ ఏర్పాటు చేసుకుని తనను కోరడంతో ప్రారంభోత్సవానికి వెళ్లానన్నారు. ఆ సమయంలో తనకు స్వాగతం పలికి శాలువా కప్పిన ఫోటోలను చూపిస్తూ కొన్ని మీడియా సంస్థలలో సాదిక్ ఖాన్ తో తనకు సంబంధం ఉందన్న రీతిలో తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఆ రోజు నుంచి ఇప్పటివరకు మళ్లీ సాధిక్ ఖాన్ తనను కలవలేదని ద్వారంపూడి స్పష్టం చేశారు. రెండుసార్లు ఎమ్మెల్యేగా చేసి ప్రస్తుతం కాకినాడ సిటీ వైఎస్ఆర్సిపి కోఆర్డినేటర్ గా ఉన్న తన ప్రతిష్టను దెబ్బతీయాలని దురుద్దేశంతోనే పథకం ప్రకారం తనపై దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఇటువంటి తప్పుడు ప్రచారాలు మీడియాకు వెన్నతో పెట్టిన విద్యగా ద్వారంపూడి వ్యాఖ్యానించారు. ఇలాంటి దుష్ప్రచారాలు మానుకోవాలని ఆయన మీడియాకు హితవు పలికారు. లేని విషయాన్ని పదేపదే ప్రచారం చేయడం ద్వారా అది వాస్తవం అన్న ధోరణిలో ప్రజలను తప్పుదారి పట్టించేందుకే ఇలా చేస్తున్నారని విమర్శించారు.

# ముగ్గురు కమ్యూనిస్టు ఉద్యమ నేతల సంస్మరణ సభ

**గుంటూరు, 25 ఆగష్టు 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** సీపీఐ రైతు, కార్మిక ఉద్యమ నేత ఆలా నాగేశ్వరరావు, శాంతి, స్నేహ సంఘం నాయకులు పి.ఆర్. ప్రకాశ్‌రావు, అరసం నేత, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ పూర్వ సంపాదకులు ఏటుకూరి ప్రసాద్‌ల సంస్మరణ సభను ఆగస్టు 26న సాయంత్రం 5 గంటలకు గుంటూరులోని కొత్తపేట మల్లయ్య లింగం భవన్‌లో నిర్వహించనున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి కోట మాల్యాద్రి తెలిపారు. మంగళవారం మల్లయ్య లింగం భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. భారత కమ్యూనిస్టు పార్టీ కోసం, పేదలు, అట్టడుగు వర్గాల ప్రజల కోసం అహర్నిశలు పనిచేస్తూ అనేక ప్రజా పోరాటాలు నిర్వహించిన ఈ ముగ్గురు నేతలను స్మరించుకోవడం గర్వకారణమన్నారు. వారి సేవలను స్మరించుకునే భాగంగా సంస్మరణ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సభకు మేధావులు, అభ్యుదయ రచయితలు, కార్మిక, కర్షక నేతలు, సీపీఐ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోట మాల్యాద్రి పిలుపునిచ్చారు.

**సిపిఐ మహా ఉద్యమంలో భాగంగా ఢిల్లీ బహిరంగ సభకు గుంటూరు నుంచి భారీగా తరలివెళ్తాం..**




సిపిఐ గుంటూరు నగర కార్యదర్శి ఆకిటి అరుణ్‌కుమార్ మాట్లాడుతూ "మార్పు కావాలి.. మార్పు రావాలి" అనే నినాదంతో భారత కమ్యూనిస్టు పార్టీ దేశవ్యాప్తంగా ప్రారంభించిన మహా ఉద్యమంలో భాగంగా గుంటూరు నగరంలో ప్రజలను చైతన్యపరుస్తూ పాదయాత్ర నిర్వహించామని తెలిపారు. అనంతరం ఈ నెల 17వ తేదీన పెద్ద ఎత్తున బహిరంగ సభ నిర్వహించామని చెప్పారు. సెప్టెంబర్ 1న ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో జరిగే భారీ బహిరంగ సభకు గుంటూరు నగరం నుంచి సిపిఐ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివెళ్తామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా సిపిఐ నిర్వహిస్తున్న ప్రజా పోరాటంలో గుంటూరు నగర సమితి నుంచి పెద్ద ఎత్తున పాల్గొంటామని అన్నారు.

**గుంటూరు నగరపాలక సంస్థ కార్యాలయంలో జరుగుతున్న ఏసీబీ విచారణపై ఆయన స్పందిస్తూ..** గతంలో జరిగిన అవకతవకలు, అభివృద్ధి పనుల పేరుతో జరిగిన అక్రమాలపై విచారణ జరుగుతున్న నేపథ్యంలో, విచారణ న్యాయబద్ధంగా నిర్వహించి దోషులను గుర్తించి కఠినంగా శిక్షించాలని సిపిఐ డిమాండ్ చేస్తోందన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజాస్వామ్య వ్యవస్థను దుర్వినియోగం చేయకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సిపిఐ ఎన్నికల బరిలోకి దిగుతుందని ఆకిటి అరుణ్‌కుమార్ తెలిపారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతున్న సిపిఐకి చట్టసభల్లో కూడా ప్రజల గొంతుక వినిపించే అవకాశం కల్పించాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా సహాయ కార్యదర్శి మేడా హనుమంతరావు, నగర సహాయ కార్యదర్శి రావుల అంజిబాబు, జిల్లా సమితి సభ్యులు జంగాల చైతన్య, బి.వెంకటేశ్వర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రైతులు సకాలంలో పంటల బీమా (ఈ-పంట) నమోదు చేసుకోవాలి

మండల వ్యవసాయ అధికారి ఎండి. ఫారుఖ్

**చెరుకుపల్లి, 25 ఆగష్టు 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** చెరుకుపల్లి మండలంలోని పొన్నపల్లి, నడింపల్లి గ్రామాల్లో మండల వ్యవసాయ అధికారి ఎండి. ఫారుఖ్ ఆధ్వర్యంలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. ప్రస్తుత ఎల్‌నినో ప్రభావం వల్ల నెలకొన్న వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని, వెద పద్ధతిలో సాగు చేసిన వరి పొలాలను అధికారులు పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. బెట్ట పరిస్థితులను తట్టుకునేందుకు పొటాషియం నైట్రేట్ (13:0:45) వంటి పోషకాలను పిచికారీ చేయాలని, సహజ వనరులను పొదుపుగా వినియోగించుకోవాలని తెలిపారు. అలాగే ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన (PMFBY) నమోదుకు ఆగస్టు 31 ఆఖరి తేదీ కావడంతో రైతులందరూ తప్పనిసరిగా బీమా చేయించుకోవాలని, రైతు సేవా కేంద్రాల్లో ఈ-పంట నమోదు పూర్తి చేసుకోవాలని సూచించారు.



ఈ కార్యక్రమంలో ఏఈవో రామకృష్ణ, వీఆర్వో శ్రావణ్ కుమార్, వీపీఏలు ఎంవీవీ ప్రసాద్, శివ సాయి తేజ తదితరులు పాల్గొన్నారు.



# ఏఈ నూకరాజు కుటుంబానికి న్యాయం చేయాలి : బీజేపీ తిరుపతిరావు

**గుంటూరు, 25 ఆగస్ట్ 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** ఏఈ నూకరాజు కుటుంబానికి న్యాయం చేయాలని, ఇటీవల వెలుగులోకి వచ్చిన ఘటనపై సమగ్ర దర్యాప్తు నిర్వహించి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ భారతీయ జనతా పార్టీ గుంటూరు జిల్లా అధ్యక్షులు చెరుకూరి తిరుపతిరావు గుంటూరు జిల్లా ఎస్పీకి మెమోరాండం మంగళవారం సమర్పించారు. ఏఈ నూకరాజు కుటుంబానికి సంబంధించిన ఈ ఘటనపై తీవ్ర అనుమానాలు, ఆందోళన వ్యక్తమవుతున్నాయని, సాదిక్ ఖాన్‌పై వచ్చిన ఆరోపణలను పూర్తిస్థాయిలో దర్యాప్తు చేసి నిజానిజాలను వెలుగులోకి తీసుకురావాలని బీజేపీ డిమాండ్ చేసింది. బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా, ఘటనకు సంబంధించిన ప్రతి అంశాన్ని లోతుగా విచారించాలని కోరింది. ఈ ఘటనకు సంబంధించి మోసం, బెదిరింపులు, ఆర్థిక దోపిడీ, బ్లాక్‌మెయిల్ వంటి తీవ్ర ఆరోపణలు మెమోరాండంలో ఉన్నాయని, వాటిపై నిష్పాక్షికంగా దర్యాప్తు జరిపి, ఆరోపణలు రుజువైతే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని బీజేపీ కోరింది. ఈ ఘటనలో సంబంధం ఉన్నట్లు తేలే ఇతర వ్యక్తులు ఎవరైనా ఉంటే వారిపైనా చట్టపరమైన చర్యలు



తీసుకోవాలని, బాధిత కుటుంబానికి పూర్తి న్యాయం జరిగేలా పోలీసు యంత్రాంగం చర్యలు చేపట్టాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా నమోదవుతున్న ఇలాంటి కేసులపై సమీక్ష చేయాలి ఈ సందర్భంగా లవ్ జిహాద్ పేరుతో నమోదవుతున్నట్లు ఆరోపణలు ఎదురవుతున్న కేసులపై రాష్ట్రవ్యాప్తంగా సమగ్ర సమీక్ష నిర్వహించాల్సిన అవసరం ఉందని తిరుపతిరావు అన్నారు. రాష్ట్రంలో ఇలాంటి కేసులపై ఇప్పటివరకు ఎన్ని ఫిర్యాదులు వచ్చాయి, ఎన్ని కేసులు ఎఫ్ ఐ ఆర్‌లుగా నమోదు అయ్యాయి, ఎలాంటి దర్యాప్తు జరిగింది, ఎలాంటి చర్యలు తీసుకున్నారు అనే అంశాలపై ప్రభుత్వం మరియు పోలీసు శాఖ ప్రజలకు స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా, బాధితులు పోలీసులను ఆశ్రయించినప్పుడు వారి ఫిర్యాదులను సీరియస్‌గా పరిగణించి, చట్టపరమైన ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు.

**డీజీపీ, హోంమంత్రి స్పందించాలి :** ఈ ఘటనపై రాష్ట్ర డీజీపీ మరియు రాష్ట్ర హోంమంత్రి వెంటనే స్పందించి, సంబంధిత కేసుపై జరుగుతున్న దర్యాప్తు, ఇప్పటివరకు తీసుకున్న చర్యలు, రాష్ట్రవ్యాప్తంగా ఇలాంటి కేసులపై పోలీసు శాఖ చేపడుతున్న చర్యలపై సమగ్ర వివరాలు వెల్లడించాలని తిరుపతిరావు డిమాండ్ చేశారు. "బాధిత కుటుంబానికి న్యాయం జరగాలి. ఆరోపణలు నిజమైతే బాధ్యులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలి. ఎలాంటి ఒత్తిళ్లకు తావులేకుండా నిష్పాక్షిక దర్యాప్తు జరగాలి" అని తిరుపతిరావు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై సుబ్బారావు, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి బజరంగ్ రామకృష్ణ, కార్యదర్శులు కే నారాయణ రెడ్డి, సురేష్ జైన్, మైనార్టీ మోర్చా జిల్లా అధ్యక్షులు షేక్ సాంబశివరావు, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు ధార అంబేద్కర్, ఎస్ టి మోర్చా జిల్లా అధ్యక్షులు నాయక్, ఎస్సీ నాయకులు రాజు తదితరులు పాల్గొన్నారు.

# ఓరియంటేషన్ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆర్జెడి లింగేశ్వర్ రెడ్డి

**గుంటూరు, 25 ఆగస్ట్ 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** రాష్ట్ర విద్యా అభ్యసన సాధన సర్వే (స్లాస్) 2026 ద్వారా విద్యార్థులు తమ తరగతులకు తగ్గ సామర్థ్యాలు ఉన్నాయా లేదో తెలుసు కోవడానికి ఉపయోగపడుతుందని గుంటూరు జిల్లా పాఠశాల విద్య ప్రాంతీయ సంయుక్త సంచాలకులు బి. లింగేశ్వర్ రెడ్డి అన్నారు. గుంటూరు పాత బస్టాండ్ కూడలిలోని పరీక్షా భవన్లో మండల విద్యాశాఖ అధికారులకు మరియు ఫీల్డ్ ఇన్విజిలేటర్లకు ఈనెల 28న జరిగే స్లాస్ పరీక్ష పై ఒకరోజు ఓరియంటేషన్ కార్యక్రమం లో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు వారు చదువుతున్న తరగతులకు తగ్గ సామర్థ్యాలు కలిగి ఉన్నప్పుడే వారు చదువులో రాణించగలుగుతారన్నారు. గుంటూరు




జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ షేక్ సలీం భాష మాట్లాడుతూ, మండల విద్యాశాఖ అధికారులు, సిఆర్పీలు మరియు ఫీల్డ్ ఇన్విజిలేటర్లు ప్రభుత్వము నియమించిన షెడ్యూలు ప్రకారము ఎటువంటి పొరపాట్లకు ఆస్కారం లేకుండా పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించి రాష్ట్రంలోనే మన జిల్లాకు మంచి పేరు తేవాలన్నారు. గుంటూరు జిల్లా డి సి ఈ బి సెక్రెటరీ కె. విజయభాస్కర్ మాట్లాడుతూ, 5,7,9 తరగతులకు పరీక్షలు నిర్వహించవలసి ఉంటుందన్నారు.గత సంవత్సరము నాలుగో తరగతి చదివిన విద్యార్థులకు 5వ తరగతి, ఆరవ తరగతి చదివిన విద్యార్థులకు ఏడవ తరగతి, 8వ తరగతి చదివిన విద్యార్థులకు 9వ తరగతి పరీక్షలు ప్రతి తరగతికి 40 మంది విద్యార్థులకు మించకుండా నిర్వహించవలసి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉప విద్యాశాఖ అధికారులు, మండల విద్యాశాఖ అధికారులు, సమగ్ర శిక్ష సిబ్బంది, సీఆర్పీలు మరియు ఫీల్డ్ ఇన్విజిలేటర్లు పాల్గొన్నారు.

